

పోసాని బెయిల్ పిటిషన్ విచారణ
నేటికి వాయిదా

ప్రజాశక్తి - కడప

పోసాని మురళీకృష్ణ బెయిల్ పిటిషన్, పోలీసు కస్టడీపై బుధవారం కడపలోని స్పెషల్ మొబైల్ కోర్టులో విచారించారు. తదుపరి విచారణను కడప కోర్టు ఈనెల 6కు వాయిదా వేసింది. పోసానిని 5 రోజులు కస్టడీకి కోరుతూ ఓబులవారిపల్లె పోలీసులు కస్టడీ పిటిషన్‌ను వేశారు. కస్టడీ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. వాదనలు విన్న మెజిస్ట్రేట్ తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. అదేవిధంగా పోసానికి బెయిల్ కోరుతూ ఆయన తరపున న్యాయవాదులు పిటిషన్ వేశారు. రైల్వే కోడూరు మేజిస్ట్రేట్ సెలవులో ఉన్నందున కడప కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. బెయిల్ పిటిషన్‌పై విచారణను కడప కోర్టు గురువారానికి వాయిదా వేసింది.

వామ్మో.. విద్యుత్ ఛార్జీలు!



- హడలెత్తిస్తున్న 'ఎఫ్‌పిపిసిఎ'
- 4 నెలల నుంచి అదనపు మోతతో జనం బెంబేలు
- దిక్కుతోచని స్థితిలో విద్యుత్ వినియోగదారులు

ప్రజాశక్తి - పులివెందులటౌన్

విద్యుత్ ఛార్జీల భారం మోయలేక జనం అల్లాడి పోతున్నారు. నాలుగు నెలల నుంచి ఎఫ్‌టిపిసిఎ ఛార్జీలతో జనం హడలెత్తిపోతున్నారు. విద్యుత్ ఛార్జీల పెరుగుదలతో వినియోగదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వం తప్పిదమంటూ కూటమి ప్రభుత్వం తప్పించుకునే పనిలో పడగా, ఈ భారమంతా కూటమి ప్రభుత్వానిదేనంటూ వైసిపి తీవ్ర విమర్శలు చేసుకుంటూ జనాల నెత్తిన భారాలు మోపి ఇరుపార్టీలు వికటాట్టహాసం చేస్తున్న పరిస్థితి నెలకొంది. వాడుకున్న విద్యుత్‌కు వస్తున్న కరెంటు బిల్లులకు ఏమాత్రమూ సంబంధం లేకుండా జనాలు లబోదిబోమంటున్న పరిస్థితి ఏర్పడింది. రూ.675 కరెంటు బిల్లులో ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ .30, కస్టమర్ ఛార్జీలు రూ .45, ఎఫ్‌పిపిసిఎ రూ.238 (వై 22. 6.8), ఎఫ్‌పిపిసిఎ. రూ . 35 (2023, 06), ఎఫ్‌పిపిసిఎ. రూ . 26 (2025. 02), ట్రూ ఆప్ ఛార్జీలు రూ. 39 ఇలా అదనపు ఛార్జీల భారం రూ.420 ఉన్న పరిస్థితి నెలకొంది. 80 యూనిట్లకు బిల్లు రూ. 255 బిల్లు వస్తే అదనపు ఛార్జీలు రూ .420 జనం నెత్తిన రుద్దిన దుస్థితి కొనసాగుతోంది. జిల్లాలో 12 లక్షలకు పైగా విద్యుత్ కనెక్ష న్లు న్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య ప్రజానీకానికి సంబంధించినవే. గత సంవత్సరం నవంబర్ నుంచి కరెంటు బిల్లులతోనే జనం తీవ్ర ఆందోళన చెందగా మార్చి నెల బిల్లులు మరింత షాక్ కొడుతున్న పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలలో ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చస్ కాస్ట్ అడ్జస్టెట్మెంట్) ఛార్జీలు రెండు ఉండగా, జనవరిలో నెలలో ఎఫ్‌పిపిసిఎల భారాలు మూడుకు చేరాయి. దీంతో బిల్లులు మోతమోగుతున్న పరిస్థితి నెలకొంది. 2022-23, 2023-24 సంవ త్సరాలకు సంబంధించి విద్యుత్ పంపిణీలో అదనపు ఖర్చుల పేరుతో జనాలపై విద్యుత్ బిల్లుల బాదుడు తారాస్థాయికి చేరింది. విద్యుత్ బిల్లులో సగానికి పైగా అదనపు ఛార్జీల భారమే ఉంటుంది. గత వైసిపి పాలనలో ఏడుసార్లు అదనపు ఛార్జీల భారం వడ్డించగా, కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలలో నవంబర్ నుంచి అదనపు ఛార్జీల భారం మోపింది. తాము అధికా రంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వరుస విద్యుత్ ఛార్జీల వడ్డన సాగిస్తోంది. ప్రస్తుతం ఎండ పెరగడంతో విద్యుత్ వాడకం మరింత ఎక్కువ అవకాశం ఉంది. వచ్చే నెలలో కరెంట్ అదనపు ఛార్జీలతో ఎంత కరెంట్ బిల్లు వస్తుందో అర్థం కాని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు.



మార్చి నెల కరెంట్ బిల్లు

ఎఫ్‌పిపిసిఎ, ట్రూ అప్ సర్దుబాట్లు

ఎఫ్‌పిపిసిఎ, ట్రూ అప్ విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం జనాలను పీల్చిపిప్పి చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చినట్లే ఇచ్చి ఇతర రూపాల్లో గుంజుకుంటుందన్న చర్చ ప్రజల్లో నెలకొంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఇక నుంచి అదనపు ఛార్జీల భారాన్ని ఏ నెలకు ఆ నెలలో వసూలు చేయాలన్న ఆలోచన సైతం విద్యుత్ శాఖ, ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.

స్మార్ట్ మీటర్లుతో అధిక బిల్లు

దుకాణాలకు స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల అధికం బిల్లు వస్తుంది. పాత మీటర్లు ఉన్నప్పుడు బిల్లు తక్కువ వచ్చేదని స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత అధిక స్పీడ్ పెరిగి అధిక యూనిట్లు రావడంతో బిల్లు కూడా ఎక్కువగా వస్తుంది. దీనికి తోడు అదనపు ఛార్జీలు మరింత భారంగా మారాయి.

- దస్తగిరి, వ్యాపారి, పులివెందుల

విద్యుత్ వాడకుండానే బిల్లులు ఎక్కువ

విద్యుత్ వాడకం తక్కువైనా కూడా కరెంటు బిల్లు మాత్రం అధికంగా వస్తుంది. బిల్లు ఎంత వస్తుందో అదనపు ఛార్జీలు అంత కంటే ఎక్కువ వేయడం వల్ల బిల్లు రెట్టింపు అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై ఆలోచించాలి.

- ఉమాదేవి, గృహిణి, పులివెందుల

భారమవుతున్న విద్యుత్ ఛార్జీలు

కూలీ పనికి పోయి ఇంటి అద్దె కట్టలేని పరిస్థితి. దీనికి తోడు అధిక విద్యుత్ ఛార్జీలు భారంగా మారుతున్నాయి. ఎక్కువ బిల్లు వచ్చే వారిపై అదనపు ఛార్జీలు విధిస్తే బాగుంటుంది. కానీ తక్కువ బిల్లు వచ్చే వాళ్లపై కూడా విధించడం వల్ల పేదలకు మరింత భారం పడే అవకాశం ఉంది.

- భవాని, వ్యవసాయ కూలీ, పులివెందుల.

రైతాంగ, కార్మిక వ్యతిరేక
విధానాలు మానుకోవాలి


కడప ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం), కార్మిక సంఘాలు, వ్యవ సాయ కార్మిక సంఘాలు, గిరిజన సమైక్య జాతీయ సమితిల పిలుపు మేరకు కడప ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం(ఎపికెఎస్) జిల్లా అధ్యక్షులు ఎం. వి. సుబ్బారెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి, సిఐటియు జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శులు ఎల్. నాగ సుబ్బారెడ్డి, బి. మనోహర్, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు పోతిరెడ్డి భాస్కర్, దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం(బి కే యం యు) జిల్లా ప్రధాన కార్యదర్శి సి. సుబ్రహ్మణ్యం, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె సి. బాదుల్లా మాట్లాడారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రోజురోజుకూ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు, గిరిజనులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందని విమర్శించారు. అన్ని పంటలకు సి2 + 50 ప్రకారం మద్దతు ధరను నిర్ణయించాలని తెలిపారు. రైతుల, కౌలు రైతుల రుణాలను బేషరతుగా మాఫీ చేయాలని, ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరితో రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు కోడ్‌లుగా కార్మిక చట్టాలను తీసుకురావడం దారుణమని పేర్కొన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, రైతుల ప్రయోజనార్థం ఆనాటి వామ పక్షాల ఒత్తిడితో యూపిఎ1 ప్రభుత్వం వేసిన స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఈ కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమ సమయంలో రైతు సంఘాల నాయకులు చేసిన, ఆనాటి, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఒప్పుకున్నా డిమాండ్లను వెంటనే అమలు చేయాలని తెలిపారు. ప్పటికైనా ఈ కేంద్ర ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు టి. మనోహర్ రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, ఎఐటియుసి నగర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, మద్దిలేటి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కట్ట యానాదయ్య, బాల చంద్రయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు టి.రామ్మోహన్‌రెడ్డి, పి. చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఎల్వి. భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, గురవయ్య, రైతు సంఘం నాయకులు మహేశ్వర్ రెడ్డి, పక్కీరప్ప, పొడదుర్తి జనార్ధన్, గిరిజన సమైక్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బ్రహ్మం, శంకర్ నాయక్, డి హెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మునయ్య, సిపిఐ నగర నాయకులు టి. సుబ్బరాయుడు, అంకుశం ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి నాగేంద్ర, పెన్షనర్స్ సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, సిఐటియు నాయకులు గోపి, కేశవ పాల్గొన్నారు.

సంతృప్త స్థాయిలో ఆరోగ్య సేవలు : కలెక్టర్
రాష్ట్ర స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ర్యాంకింగ్‌లో జిల్లాకు రెండో స్థానం

ప్రజాశక్తి కడప అర్బన్

గ్రామ,పట్టణ స్థాయిలో వైద్యారోగ్య శాఖలో వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సంతృప్త స్థాయిలో ఆరోగ్య సేవలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. ఒపి, ఐపి,ల్యాబ్ టెస్టు, డెలివరీ వంటి ఆరోగ్య సేవలలో ఎ గ్రేడ్ సాధించి రాష్ట్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ర్యాంకింగ్ లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ఆరోగ్యశ్రీ, అనుబంధ ఆస్పత్రులు, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆరోగ్య సూచికలు, వైద్య శాఖ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమెందని, వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు విజృంభించకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లలో ప్రస్తుత స్టేటస్ ఓపి, ఐపి, డెలివరీలు, ఇమ్యూనైజేషన్ వంటి రోజువారి డేటాను నమోదు చేయాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఉత్తమమైన మౌలిక వసతుల సదుపాయాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ నిబద్ధతతో తమ కర్తవ్యాన్ని నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందే వైద్య సేవలు, వైద్యాధికారుల పనితీరు, ఆరోగ్య కేంద్రాల్లో ఓపిల నమోదు సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. ప్రణాళికా ప్రకారం సుఖ ప్రసవాలు, ఇమ్మునైజేషన్ వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం, మాతృ, శిశు మరణాల సంఖ్యను తగ్గించడం, 104 వాహనాల షెడ్యూలు, తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు, తదితర ఆరోగ్య సేవలపై వైద్యాధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పర్ఫామెన్స్ ఇండికేటర్స్‌లో మంచి ప్రతిభ చూపిన వైద్యాధికారులను కలెక్టర్ అభినందించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యాధికారులు మూడు నెలల ప్లాన్ అఫ్ యాక్షన్‌పైన పి పి టి ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే హెల్త్ ప్రోగ్రామ్స్ ప్రత్యేక దృష్టి సారించి వెనుకబడిన పారామీటర్స్‌లను మెరుగుపరుచుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నాగరాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ బాలంజనేయులు, డిసిహెచ్ఎస్ ఇన్‌ఛార్జి కరిముల్లా, కడప డిప్యూటీ డిఎంహెచ్ఒ ఉమా మహేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒలు మల్లేష్, ఖాజా మొయినుద్దీన్, శివ ప్రసాద్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

10న ఐటిఐ అప్రెంటిస్ మేళా

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని కాగితాల పెంటలో ఉన్న ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 10న అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎడి రత్నరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఐటిఐ అభ్యర్థులు తమ పదవ తరగతి, ఐటిఐ మార్కుల జాబితా, ఎన్‌టిసి సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ పుస్తకం, ఒక సెట్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు. ఐటిఐ పాస్ అయిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి - కడప : కడప నగర వీధుల్లో వ్యాపారం చేసే చిరు వ్యాపారులకు బుధవారం కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బ్యాంక్ రీజనల్ హెడ్ కె. మురళీమోహన్ సమక్షంలో గొడుగులను పంపిణీ చేశారు. ఎండాకాలం ప్రారంభం కావడంతో వీధుల్లో రోడ్లపై చిరు వ్యాపారం చేసే వారికి ఎండ, వడదెబ్బ తగలకుండా ఉండేందుకు గొడుగులు పంపిణీ చేసినట్లు మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఎస్. రమేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


గొడుగులు పంపిణీ చేస్తున్న కెనరాబ్యాంక్ రీజనల్ హెడ్ మురళీమోహన్


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ

వైద్య విద్యలో రిమ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప సిటీ

ఇటీవల నిర్వహించిన యూనివర్సిటీ పీజీ ఫైనల్ పరీక్షల్లో వివిధ విభాగాలలో రిమ్స్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మెడిసిన్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఇఎన్‌టి, ఆప్తాలమాలజీ, పీడియాట్రిక్స్, అనస్థీషియాలజీలో, డెర్మటాలజీ విభాగాల్లో మొత్తం 33 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో నిలిచారు. విద్యార్థిని డాక్టర్ లావణ్య 76 మార్కులు సాధించారు డాక్టర్ విరాజిత మెడిసిన్ విభాగంలో ఏకంగా గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. విద్యార్థుల విజయం పట్ల ఆనందాన్ని ప్రకటిస్తూ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ, రిమ్స్ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. **గోల్డ్ మెడల్ సాధించిన పీజీ విద్యార్థి..** ఇటీవల నిర్వహించిన పీజీ పరీక్షలలో రాష్ట్రస్థాయిలో వైద్య విద్యార్థిని డాక్టర్ పందల విరాజిత 609 అత్యధిక మార్కులు తెచ్చుకుని ఎన్టీఆర్ వైద్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. విద్యార్థిని కృషి , జనరల్ మెడిసిన్ అధ్యాపకుల మార్గదర్శనం వల్లనే గోల్డ్ మెడల్ సాధించిందని అడిషనల్ డీఎంఇ, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ తెలియజేశారు. గోల్డ్ మెడలిస్ట్ పీజీ డాక్టర్ విరాజితను పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, జనరల్ మెడిసిన్ ఆచార్యులు, విభాగాధిపతి డాక్టర్ కె.బి. యాదవేంద్రరెడ్డి, సహాయక ఆచార్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ లీలాప్రసాద్‌బాబు, డాక్టర్ విజయ సింహారెడ్డి, డాక్టర్ అర్జున్ అవ్వారు, డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

మహిళలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - కడప : ప్రతి మహిళా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిక అధికారి శ్రీలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం నర్సింగ్ కళాశాలలో కౌమార బాలికలకు వృత్తి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి మహిళా తమ జీవితంలో తప్పకుండా స్కిల్స్ మెరుగుపరుచుకోవాలని, నర్సింగ్ వృత్తి చాలా ప్రాముఖ్యమైందని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ హిమ గిరి కుమారి మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిని ఎంచుకోవడం ఎంతో విశిష్టమైందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పిహెచ్ఇడబ్ల్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, శ్రీ చైతన్య స్కూల్స్ ప్రతినిధులు క్యాంపస్ ఎంపికలకు రానున్నారని పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన విద్యార్థులు ఉద్యోగ ఎంపికలకు హాజరుకావాలని పేర్కొన్నారు. కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, తెలుగు, ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్స్, సోషల్ స్టడీస్ స్పెషలైజేషన్లను కలిగిన విద్యార్థులు విశ్వవిద్యాలయ నూతన పరిపాలన భవనంలోని ప్లేస్మెంట్ సెల్‌లో హాజరై ప్రయోజనం పొందాలని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు కోరారు. బుధవారం ప్రభుత్వ పెన్షన్ల సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పెన్షనర్ల భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించి అనేక సమస్యలున్నాయని పేర్కొన్నారు. ఇందులో అడిషనల్ క్వాంటమ్ 7 నుంచి 10కి మార్చుట, 12 నుంచి 15 శాతానికి మార్చడం ప్రధానమైన డిమాండ్ అన్నారు. ఇప్పుడున్న రూ. 2 లక్షలు ఇహెచ్ఎస్ మొత్తాన్ని రూ. 5 లక్షలు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసులు, బాలయోల్లారెడ్డి, ఉపాధ్యక్షులు నారాయణ, చెంచు రెడ్డి, మస్తాన్, అపూర్వ సుందరి, సుభాన్, విద్వాన్ గానుపెంట హనుమంతరావు, సుబ్బరాయుడు, మేకల సుబ్బరాయుడు, పార్వతమ్మ, నాగయ్య, మల్లయ్య, నాగరత్నాచారి, రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


పోలీసు అధికారులకు సూచనలిస్తున్న జడ్జి

ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి : జడ్జి

ప్రజాశక్తి - కడప

ఈనెల 8న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా తక్కువ వ్యవధిలోనే ఇరువర్గాల వారు కేసులను పరిష్కరించుకుని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట అడిషనల్ ఎస్పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే, కడప అడిషనల్ ఎస్పి ప్రకాష్ బాబు, ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి భావన, కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యలను డిఎల్‌డిఎస్ఎ దృష్టికి తీసుకురావాలి

పులివెందుల : ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పులివెందుల సబ్ జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

వ్యవసాయంలో కీలక పాత్ర పోషించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : వ్యవసాయంలో రైతులు కీలక పాత్ర పోషించాలని వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ అనుసంధానాల గురించి అవగాహన సదస్సు జెడిఎ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఉద్యాన శాఖ అధికారి (సాంకేతిక) జ్యోతిర్మయి, ఎస్ఎస్‌వి సుభాషిణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ జి.జనార్ధన, నాబార్డ్ డిడిఎం విజయ విహారి, పీలేరు నుంచి ఎఫ్ బిఒను విజయవంతంగా నిర్వహించి అవార్డు పొందిన జయబ్బనాయుడు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు గ్రూపులుగా ఏర్పడి, ఐకమత్యంగా ఉండి ఆర్థిక అభివృద్ధి చెందవచ్చని, వ్యవసాయ రంగంలో కీలక పాత్రను పోషించాలని తెలిపారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారిని మరింత శక్తిమంతం చేయవచ్చని పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రైతుల ఉత్పత్తిదారుల సంఘాలు ఎదుర్కొంటున్న బ్యాంకు రుణాల సమస్యల గురించి చర్చించారు.

బిఎస్‌పి మహాసదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : బిఎస్‌పి మహా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప పిలుపునిచ్చారు. బుధవారం బిఎస్‌పి కార్యాలయంలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న విజయవాడలో మహా సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాలచంద్ర, ప్రధాన కార్యదర్శి ఓబయ్య, బద్వేల్ అసెంబ్లీ అధ్యక్షులు గౌస్ పీర్, మైదుకూరు బేబీ, ప్రొద్దుటూరు రవి పాల్గొన్నారు.

7న మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2నెల 7న ఉదయం 10 గంటలకు జమ్మలమడుగులో ఉన్న న్యాక్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ పూర్తయిన వారు జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

గుణాత్మక విద్యే ధ్యేయం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జీవో 117 ఉపసంహరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందడమే కాకుండా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయనుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జీవో 117 ఉపసంహరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సన్నాహక మార్గదర్శకాలపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ, నివేధికల సమర్పణ తదితర అంశాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవో 117ను ఉపసంహరించిన తర్వాత అందుకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించిందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే సన్నాహక మార్గదర్శకాలపై ఉత్తర్వులు కూడా విడుదల చేసిందన్నారు. 2 నెలల పాటు క్షేత్ర స్థాయిలో కూడా సంబంధిత శాఖల అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, పలువురు మేధావులతో అధ్యయనం చేపట్టినట్లు తెలిపారు. నివేదిక పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం సూచించిన ప్రామాణిక ఆధారంగా జిల్లాలోని పాఠశాలలలో కొంత మార్పును చేస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత కొత్తగా జారీచేసే జీవో ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో డిఇఒ షంషుద్దీన్, మండల విద్యాశాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

15న ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ -2025 కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాలలోని 18 -25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పోటీలు వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై ఉంటాయని తెలిపారు. జిల్లాలో గెలుపొందిన విజేత రాష్ట్ర స్థాయి, దేశ స్థాయిలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 15న కడపలోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజికల్ పద్ధతిలో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉపన్యాస పోటీలలో పాల్గొన దలచిన వారు ముందుగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేసి పేర్లను https://forms. gle/GwMcm Uox5 CvSyp9x లో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9177616677లో సంప్రదిం చాలన్నారు.

అధ్యాపకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఒంగోలు ట్రిపుల్ ఐటి ఫిజిక్స్ ఒప్పంద అధ్యాపకుడు తిరుపతిరావుపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను బోధించాల్సిన ఒక అధ్యాపకుడు విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురి చేయడం దర్మార్గమని ఇలా చేస్తే రాబోయే రోజుల్లో విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులు చేసిన తిరుపతి రావుపై చర్యలు తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఎస్ఇ

జాగ్రత్తలపై పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప

విద్యుత్ పనులు చేసేటప్పుడు సిబ్బంది తీసుకోవాల్సిన భద్రత సూచనలపై పోస్టర్లను బుధవారం కడప విద్యుత్ భవన్‌లోని ఎస్ఇ ఛాంబర్‌లో వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్. రమణ ఆవిష్కరించారు. సిబ్బందికి భద్రతా సూచనలుపై అవగాహన కల్పించేందుకు పోస్టర్లను జిల్లాలోని అన్ని విద్యుత్ కార్యాలయం, సబస్‌స్టేషన్లల్లో అంటించాలని తెలియజేశారు. భద్రతా నియమాలు పాటించకుండా విద్యుత్ పనులు చేసే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది తమ విధులలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా భద్రత నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎగిక్యూటివ్ ఇంజినీర్లు మధుసూదన్, హరి సేవ్య నాయక్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.నరసింహారెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌లు ఎం.మధుసూదన్‌రెడ్డి, హుస్సేన్ బాషా, డిఈఈ మోహ న్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - కడప అర్బన్ :రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రతినెల వేతనాల కోసం ఎదురు చూడటం ఎంతవరకు సమంజసమని సిఆర్‌పి హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆదిమూలం శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని రకాల ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ను సంవత్సరానికి ఒకసారి కేటాయించాలని తెలిపారు. ఇలా ప్రతినెలా ఎదురుచూపుల తర్వాత బడ్జెట్‌ను విడుదల చేయడం దారుణమని పేర్కొన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని రకాల ఉద్యోగులకు ఇచ్చేవి అరకొర వేతనాలేనని తెలిపారు. అలాంటివి ప్రతినెలా ఇలా ఆలస్యం చేస్తూ వారి అప్పుల భారానికి కారణం కాకుండా ముందుగా విడుదల చేయాలని పేర్కొన్నారు.

పీరయ్య చిత్రపటానికి నివాళి


పీరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు, జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు పోతుగంటి పీరయ్య చిత్రపటానికి టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు ఘననివాళి అర్పించారు. బుధవారం ఎన్ఆర్ఐ టిడిపి కార్యాలయంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. పీరయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ,జిల్లా ఉపాధ్యక్షులు ఏటూరి లోకేష్, మాసాపేట 26వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి చావలముడి శంకర్, ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రవి శంకర్ రెడ్డి, టిడిపి నాయకులు నరసింహ, శేఖర్, రాఘవ, మీడియా కో- ఆర్డినేటర్ విశ్వనాథ్, నాయకులు ఇర్ఫాన్, ప్రభాకర్, రాజారత్నం పాల్గొన్నారు.



కంటి అద్దాలతో విద్యార్థులు

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - తొండూరు

జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు బుధవారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి చూపుతో బాధపడుతున్న విద్యార్థులకు కంటి వైద్యాధికారి జివి లక్ష్మీదేవి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కెవి సుబ్బారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామిరెడ్డి

ఒలంపియాడ్‌లో 'నలంద' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జాతీయస్థాయిలో సైన్స్ ఒలంపియాడ్‌లో స్థానిక ఇ టెక్నో నలంద పాఠశాల విద్యార్థులు 15 మంది బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ బి.సోమేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందని ప్రిన్సిపల్ బి.వెంకటస్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సి.విజిత, ఇ.సర్వేశ్వర్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ మార్కులు సాధిస్తే చేయూత

- వైజార్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం



మండలంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి తమ ట్రస్ట్ ద్వారా చేయూతనిస్తామని వైజార్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సంద్యాపల్లె గ్రామవాసి అయిన శ్రీధర్‌రెడ్డి బుధవారం సింహాద్రిపురంలో విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల్లో విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. గతేడాదిలాగే ఈ విద్యా సంవత్సరం కూడా పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.4వేలు, రూ.3వేలు, రూ.2 వేలు నగదు ప్రోత్సాహం అందజేస్తామన్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లమో కోర్సుల్లో చదవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులను ముగ్గురిని గుర్తించి వారికి ఒక్కొక్కరికి రూ.10వేలు ఈ ఏడాది నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల అభ్యున్నతికి ట్రస్టు అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజక వర్గం, జిల్లాస్థాయి వరకు విస్తరించనున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నతంగా చదివి ఉద్యోగ అవకాశాలు రాని వారికి సైతం తమ ట్రస్ట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యమన్నారు.

దోమకాటుకు గురికావొద్దు

ప్రజాశక్తి - వేముల

దోమ కాటు బారిన పడొద్దు-అనారోగ్యానికి గురికావద్దు అని జిల్లా మలేరియా అధికారి మనోరమ పేర్కొన్నారు. వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని స్థానిక బెస్తవారిపల్లె సమీపంలో ఉన్న రోడ్డు నిర్మాణ కార్మికులకు సంబంధించిన కంపెనీ నిర్మించిన తాత్కాలిక నివాస గృహాలను బుధవారం ఉదయం మనోరమ సందర్శించారు. అందులో భాగంగా హెచ్ఆర్, కార్మికులకు దోమ కాటుకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సూపర్‌వైజర్ రమేష్, సిహెచ్ఒ వీణా కుమారి, ఆరోగ్య కార్యకర్తలు నాగేశ్వర, గోపాల్, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, శాంతి, కార్మికులు పాల్గొన్నారు.



అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో భార్య, ఎద్దు మృతి

- భర్తకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని ఏటూరు గ్రామం వద్ద బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏటూరు గ్రామానికి చెందిన రాఘవరెడ్డి, అతని భార్య నారాయణమ్మ పొలం పనుల నిమిత్తం ఎద్ల బండిలో వెళుతుండగా.. తాడిపత్రి నుంచి కడప వైపు పోతున్న లారీ ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణమ్మ, ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా, రాఘవరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ హృషి కేశవరెడ్డి తెలిపారు.



మృతి చెందిన ఎద్దు, నారాయణమ్మ, గాయపడిన రాఘవరెడ్డి

ట్రిపుల్‌ఐటి గెస్ట్ ప్యాకల్టీపై కేసు నమోదు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఒంగోలు ట్రిపుల్‌ఐటిలో పని చేస్తున్న ఫిజిక్స్ గెస్ట్ ప్యాకల్టీ తిరుపతిరావుపై కేసు నమోదు చేసినట్లు ఆర్కేవ్యాలీ ఇన్‌ఛార్జి ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఇంజినీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిపై ఒంగోలు ట్రిపుల్‌ఐటి గెస్ట్ ప్యాకల్టీ తిరుపతి రావు వేధిస్తున్నాడని, వేధింపులకు గురైన విద్యార్థిని ఆర్కేవ్యాలీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రపంచం ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు



ద్రవ జీవామృతం తయారు విధానాన్ని వివరిస్తున్న నుజహత్

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రపంచం ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతూ.. పంటలు సాగు చేస్తోందని ప్రకృతి వ్యవసాయ జిల్లా డిపిఎం ఎస్‌వి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని యామవరం గ్రామంలో బుధవారం ఎఒ వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రకతి వ్యవసాయంపై రైతులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే విధానం, పాటించవలసిన మెలకువలు రైతులకు వివరించారు. భూమిలో సేంద్రియ కర్బనం కాపాడుకునే విధానం గురించి తెలిపారు. ప్రతి ఒక్క రైతు ప్రకృతిలో లభించే ఎరువులతో వ్యవసాయం చేయాలని, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సాహకం అందించేందుకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.61.78 కోట్లు కేటాయించిందన్నారు. రైతులు ప్రకతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. సహజ సిద్ధమైన సేంద్రియ పద్ధతులను అనుసరించి పండించే పంటలకు భవిష్యత్తులో మంచి ధర ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను గుర్తించి పంట మార్కెట్లో అమ్ముకొనేందుకు వారికి ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. నుజహత్ మాట్లాడుతూ ద్రవ జీవామృతం, కోడి గ్రుడ్డు, నిమ్మ ద్రావణాన్ని తయారు చేసే విధానం గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి రైతు నజీర్ సాగు చేసిన జామ, బత్తాయి, సపోట పంటలను అధికారులు పరిశీలించారు. పవర్ వీడర్ పరికరాన్ని పరిశీలించి, పనిచేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ పాటిల్ భరత్, ఎమ్‌టి నాగ సుబ్బరాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.రామసుధ, ముని భూపాల్, రమణయ్య, సల్మా, రామాంజినమ్మ, లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

'వ్యవసాయ యాంత్రీకరణ'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు భూ ఆధార్ కార్డుకు స్థానిక రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ మొదలు పథకాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా ప్రస్తుతం 2 ఇంచుల నీటి పైపులు సబ్సిడీ ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ పరికరాలు, మందు పిచికారి స్ప్రేయర్లు సబ్సిడీలోకి రాగానే సమాచారం ఇస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విఎఎ సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళ పాత్ర గొప్పది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమాజ నిర్మాణంలో మహిళ పాత్ర గొప్పదని 33వ వార్డు కౌన్సిలర్, న్యాయవాది గాజుల శివజ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శివజ్యోతి 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంగా జరుపుకునే వారని గుర్తు చేశారు. తల్లి లేకపోతే సమాజం అనాధగా మిగిలిపోతుందన్నారు. ఎక్కడ స్త్రీ పూజింపబడుతుందో అక్కడ దేవతలు కొలువుంటారు అన్నది అక్షర సత్యం అన్నారు. మహిళా సాధికారిక సాధనలో సమానత్వం పునాది అన్నారు. మహిళ అభివృద్ధి సాధించేందుకు విద్య ఓ పట్టుకొమ్మ అన్నారు. విద్య విజ్ఞానం ద్వారానే నేడు మహిళలు అనేక రంగాల్లో రాణించగలుగుతున్నారన్నారు. గురుశాధిక్య సమాజంలో మహిళల ఎదుగుదలను ఓర్వలేక చాందస వాదాల భావజాలంలో పురుషుడు ఆటంకాలు కలిగించడం శోచనీయమని పేర్కొన్నారు. యునెస్కో ప్రకారం ఆడపిల్లల విద్యార్థులకు ఆటంకం హింస అన్నారు. ఆడపిల్ల విద్యార్జనకు భద్రత చాలా ముఖ్యమన్నారు తను భద్రంగా ఉన్నానని ధైర్యంగా ఉన్నప్పుడే మహిళ ఎంత



గాజుల శివజ్యోతి

ఎత్తుకైనా ఎదగ గలుగుతుందని తెలిపారు. ప్రకృతిరీత్యా మహిళ శారీరకంగా బలహీనురాలైన ప్పటికీ మానసికంగా ఎంతో బలవంతురాలు. పురుషుడికి రోజులో కొద్దిసేపైనా విశ్రాంతి దొరుకుతుందేమో కానీ మహిళకు మాత్రం దొరకదన్నారు. ఇంటి పని, ఉద్యోగ బాధ్యత నిర్వహణలో అలసట ఎరుగక నిరంతరం శ్రమిస్తూనే ఉంటుందన్నారు. సమాజ సంతోషమే తన శ్రమకు గుర్తింపుగా భావిస్తుందన్నారు. మద్యం ప్రభుత్వాల మనుగడకు పాడి ఆవుగా రూపాంతరం చెందడంతో స్త్రీలపై ఆధిపత్యం, కుటుంబ హింసను పెంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీలపై హింస, సామాజిక అసమానతలకు మూలం పితృస్వామ్యమేనని తెలిపారు. కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. కుటుంబానికి మంచి జరిగేలా తద్వారా సమాజం మంచిగా ఎదిగేలా మహిళల విధి నిర్వహణ అజరామరం అన్నారు. మహిళలు నిజజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. వారికి చట్టపరమైన రక్షణ ఉన్నప్పటికీ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు సమాన హక్కులు.. సమాన అవకాశాలు కలిగేలా ఉండాలన్నారు. మహిళల ఓటు హక్కు కోసం చేసిన పోరాటం నుండి శాస్త్ర సాంకేతిక రంగాల్లో విజయ బావుటా ఎగిరేసే వరకు మహిళ పురోగతి సాధించిందన్నారు. అయినా కొంత వెనుకబాటుతనంతో ముడుచుకు పోతోందనే ఆవేదన వ్యక్తం చేశారు. సృష్టికి మూలమైన మహిళను బలోపేతం చేసేందుకు అందరం ఐక్యం కావాలన్నారు. అప్పుడే మహిళ ఔన్నత్యం ప్రపంచ యవనికపై రెపరెపలాడుతుందని శివజ్యోతి పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కడప-కర్నూలు జాతీయ రహదారి భూమాయపల్లె వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాటి నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎపి రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని భూమాయపల్లె హైవేపై ఆయన ప్రజలతో కలిసి ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోందన్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ దీపాలు లేక పోవడం వంటి సమస్యలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వెంటనే జాతీయ రహదారి భద్రత విభాగ అధికారులు చర్యలు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భూమాయపల్లి నుంచి శాంతి నగరం, మూలవారిపల్లి, ముత్తులూరుపాడు గ్రామాల ప్రజలు నిత్యం వేలది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. భూమాయపల్లె వద్ద ప్రయాణికులు వేచి ఉండడానికి బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆ మేరకు జాతీయ రహదారి విభాగ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నామన్నారు.



చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహిళల రక్షణకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎస్ఐ తులసి నాగప్రసాద్ పేర్కొన్నారు. సింహాద్రిపురం జిల్లా పరిషత్ హైస్కూల్, శ్రీ వివేకానంద పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఈనెల 8న అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకుని చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మొబైల్ వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శ్రీవివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి, జిల్లా పరిషత్ హైస్కూల్ ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ భవిష్యత్‌కు పునాది మహిళలు

ప్రజాశక్తి - వేంపల్లె

దేశ, కుటుంబ భవిష్యత్‌కు పునాది మహిళలని ఎస్ఐ రంగారావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరాలకు మహిళలు ఆదర్శంగా జీవించాలన్నారు. ప్రతి మహిళ దేశ పురోభివృద్ధికి పాటు పడాలన్నారు. మహిళలు వివిధ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో సాధించిన విజయాల గురించి వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. తమ మొబైల్ ఫోన్ వినియోగంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజనేయులు మాట్లాడుతూ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మహిళా దినోత్సవం రోజున వేంపల్లె సిఐ సురేష్‌రెడ్డిచే బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సభ్యురాలు డాక్టర్ మల్లేశ్వరమ్మ, లైబ్రేరియన్ మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, భూపేష్‌రెడ్డి

మునకవాసుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గండికోట డ్యామ్ నిర్మాణానికి భూములు కోల్పోయిన మునక వాసుల సమస్యలను పరిష్కారించాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంట్ ఎన్‌డిఎ కూటమి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి బుధవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో వారు మునకవాసులతో కలిసి మంత్రితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రలో గండికోట ముంపు వాసులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అందులో భాగంగానే ఎన్నికల సమయంలో తాము కూడా స్థానికంగా ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని చెప్పామన్నారు. మనల్ని నమ్మి గెలిపించారని అందుకు నేడు వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొండాపురం మండల ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల శివనారాయణ రెడ్డి, ఆర్అండ్ఆర్ కమిషనర్ సాయి ప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు, ముంపునకు గురైన 22గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాసేవలో ఎంపిజె ముందంజ

- ఎంపిజె ఆవిర్భావం సందర్భంగా సభ్యులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆవిర్భావ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీజే సంస్థ 2005 మార్చి ఐదున ఆవిర్భవించి నేటికి 20ఏళ్ల కల విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇన్‌ఛార్జి అయుబ్‌ఖాన్ మాట్లాడుతూ ఎంపీజే సంస్థ పేద, పీడితుల, అణగారిన వర్గాల, మహిళలకు అండగా ఉంటూ వారి హక్కుల కోసం ప్రజాసేవలో ముందు ఉందన్నారు. నిత్యం ప్రజాసేవలో సాగిపోతుందన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఎంపీజే సంస్థ సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్రిమి, పట్టణ అధ్యక్షులు హుస్సేన్‌బాషా, ఉపాధ్యక్షులు నజీర్, కార్యదర్శి మహమ్మద్ రఫీ, మీడియా కార్యదర్శి మహమ్మద్ అస్లం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు ముక్తియార్, రవి, అల్లాబకాష్ పాల్గొన్నారు.



రోగులకు పండ్లు అందజేస్తున్న ఎంపిజె సభ్యులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి వైసిపిని బలోపేతం దిశగా అడుగులు వేస్తామని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి బుధవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ నేషన్ వన్ ఎలక్షన్‌లో భాగంగా 2027లో సార్వత్రిక ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. డీ లిమిటేషన్‌లో భాగంగా రాష్ట్రంలో 225 నియోజక వర్గాలు అయ్యే అవకాశం ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసిపి శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో రైతు కూడా సుఖంగా లేదని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో కెపి ఉల్లి, పసుపునకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేశామన్నారు. టిడిపి ప్రభుత్వంలో ప్రభుత్వపరంగా ఏ రైతుకైనా ఒక్క రూపాయి ఇచ్చారా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ప్రజలు ఎన్నుకోబడిన వారిని మభ్య పెట్టి టిడిపి వారు కైవసం చేసుకుంటున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మహేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మావూళ్లమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని చిలేకాంపల్లె గ్రామం నారపరెడ్డిగారి పల్లె సమీపాన వెలసిన మావూళ్లమ్మ దేవతకు బుధవారం టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. చండీ హోమం, అభిషేకాలు నిర్వహించారు. నూతన ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి మహేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కమిటీ సభ్యులు పెద్దమావిరెడ్డిగారి మావిరెడ్డి, చిదం బరంరెడ్డి, రామాంజనేయ రెడ్డి, గంగవరపు ప్రసాద్‌రెడ్డి స్వాగతం పలికారు. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, టిడిపి నాయకుడు దేశాయ్ గంగిరెడ్డి, బాలే రామాంజనేయరెడ్డి, యువ నాయకుడు గణేష్‌రెడ్డి, నాగేంద్ర, మాజీ ఉప మండల అధ్యక్షుడు నరసింహులు, డీలర్ వాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గండిక్షేత్రంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని మారెళ్లమడక పంచాయతీలో ఉన్న గండి క్షేత్రంలో తలనీలాలు ప్రోగు చేయుటకు గురువారం ఉదయం వేలం పాటలను నిర్వహిస్తుట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. గండి క్షేత్రంలోని కల్యాణ కట్టలో భక్తాదులు సమర్పించు తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కు కోసం బహిరంగ వేలం పాట వేస్తున్నామన్నారు. వేలం పాట దక్కించుకున్న వారికి ఏడాది కాలం హక్కు ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు రూ.25 లక్షలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ముగిసిన మార్కెట్ హక్కుల వేలం

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలో మార్కెట్ గుత్త హక్కుల వేలంపాట బుధవారం ముగిసినట్లు నగర పంచాయతి కమిషనర్ శేషఫణి ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్‌ను రూ.12,42,000 సుమన్ కుమార్‌రెడ్డి దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు మార్కెట్ గేటు ఫీజులు రాబట్టుకునేందుకు హక్కులు ఉంటాయన్నారు.

ఆర్‌టిసి కార్మికుల ఆశాజ్యోతి 'పెండ్యాల'

ప్రొద్దుటూరు : ఎన్ఎంయు వ్యవస్థాపకులు రాజీవ్ రత్న అవార్డు గ్రహీత కార్మిక ఆశాజ్యోతి పెండ్యాల రామ్మోహన్‌రావు ఆర్‌టిసి కార్మికుల ఆశాజ్యోతి అని కార్మిక సంఘం నాయకులు కొనియాడారు. రామ్మోహన్‌రావు 20వ వర్ధంతి సందర్భంగా బుధవారం డిపో కార్యదర్శి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో డిపో ఆవంఇలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోనల్ కమిటీ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ రామ్మోహన్రావు కార్మికుల శ్రేయస్సు కోసం చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్ర అధ్యక్షులు రమణా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు శివారెడ్డి ఆయన ఆశయా లను కొనసాగిస్తున్నారని తెలిపారు. డిపో ఆవ రణలో అన్నదానం చేశారు. సూర్య నారాయణ, రాజ గోపాల్‌రెడ్డి, బాబయ్య, అయ్యవారప్ప, బాబు, అశోక్, పాల్గొన్నారు.